# ప్రేమజీవి

రచన :
కె. బి. గంగాధరరావు

కార్యక్రమమంతా సంతోషంతో గడచిపోయింది. వాన కురిసి వెలిసినట్లయింది. అబ్బ! ప్రొద్దుటనుంచి ఎంత హడావుడి మాకున్న బంధువులు, స్నేహితులు అందరూ వచ్చారు. పురోహితుడు రావడమే తరువాయి. మేమిద్దరం చెరో పీటమీద ఆసీనులమయ్యాం. కమల సగర్వంగా పదకొండు రోజుల పసిపాపను చేతుల్లో పెట్టుకొని ఆడిస్తోంది. అప్పుడప్పుడు చిరునవ్వుతో క్రీగంట నావంక చూస్తూ పాపవంక చూస్తూ ఆనంద పరవశురాలవుతోంది. నిజంగా ఆలోచిస్తే యిందులో తాను గర్వపడాల్సిందేముంది? పాపను చూచి నేనూ గర్వపడొచ్చు! వేదోక్తంగా పురోహితుడన్ని విధులూ నెరవేర్చాడు. "ఏమండీ, పిల్లవానికి నామధేయం ఏముంచమంటారు?" అని అడిగాడు. "నామధేయం" అనగానే నా శరీరం జలదరించింది. కళ్లంట నీళ్లు గిర్రునతిరిగాయి. అదృష్టవశాత్తు మా మామగారు అందుకొని "నామధేయం సంగతి నిదానంగా ఆలోచించి నిర్ణయించుకుంటాంలెండి శాస్త్రులుగారూ" అనడంతో "అలానే కానివ్వండి. నావిధి ప్రకారం నేనడిగాను" అన్నాడు. ఎంత ప్రయత్నించినా కళ్లంట రెండు చుక్కలు రాల్చకుండా వుండలేకపోయాను. కళ్లనీళ్లు తుడుచుకొని ఎవరూ చూడలేదు గదా యని ఒక్కసారి పరిశీలించి ఎవరూ నావంక చూడకపోవడం చూచి సంతోషించాను. కమలకేసి చూతును గదా కమల ముఖం వాడిపోయింది! దీర్ఘంగా ఆలోచిస్తూ నావంక తదేకదృష్టితో చూస్తోంది 'ఏమండీ!' అని మాత్రం అనగలిగింది. 'ఏమీ లేదు లే' అని నేను క్లుప్తంగా సమాధానమిచ్చి వూరుకొన్నాను. తరువాత అందరం విందులో పాల్గొన్నాము. స్నేహితురాండ్రంతా కమలచుట్టూ చేరి "బంగారంవంటి పిల్లవాణ్ణి కన్నావు. నీకేమి లేకమలా" అని హాస్యాలాడుతున్నారు. అటువంటి మాటలే నాస్నేహితులవల్ల నాకూ ముట్టాయి. వచ్చిన అతిథులందరూ మా యిద్దర్ని అభినందించి వెళ్లిపోయారు.

చల్లగాలికి మేడపైన వసారాలో పడక కుర్చీలో కూచున్నా. పూర్ణిమ వెన్నెల నాకాళ్ల మీద ప్రసరిస్తోంది. ప్రొద్దుపోవడంచేతనేమో పరిసరాలన్నీ నిశ్శబ్దంగా వున్నాయి. భోజనం కాలేదు. ఇంతలో మేడమెట్లమీద కాళ్ళ చప్పుడు వినవచ్చింది. క్షణంలో కమల ప్రత్యక్షమై "ఏమండీ ఇంకా లేవలేదే? లెండి. భోజనంచేద్దురు గాని" అని అంటూ నా ముందు బల్లపై కూర్చుంది. 2 నిమిషాలవరకు నానుంచి కమల ప్రత్యుత్తరం పొందలేకపోయింది. "ఏమండోయ్! మిమ్మల్నే తండ్రినైనా ననే సంతోషంతో మాట్లాడడమే మానివేశారు?" అని పెద్దగా నవ్వుతూ దీర్ఘముగా ఆలోచిస్తున్న నా ముఖాన్ని చూచి నవ్వడం మాని "ఏమండీ, పొద్దుట పురోహితుడు అబ్బాయి పేరేమి పెట్టమంటారు అని అడిగితే మీకు కళ్ళంట నీళ్ళుతిరిగాయేమిటి? చెప్పరూ" అని అడిగింది. "ఏమిటీ, కమలా నా కళ్ళంట నీళ్ళు తిరిగాయా?" అని ఏమీ ఎరగనట్లే ప్రశ్నించాను. "అబ్బా ఎంత నంగనాచులండీ? నేను చూడలేదనుకున్నారా? చెప్పండి. ఎందుకలా అంటారు? అని నా జవాబుకు ఆత్రంగా నిరీక్షిస్తోంది. చెప్పక తప్పదనుకున్నా. ఇటువంటి విషాదచరిత్రను మనసులోనే వుంచుకొని కుమిలిపోయేకంటే ఆప్తులకు చెపితే కొంత మనఃశాంతి కలుగుతుంది కదా! "కమలా అదో విషాదచరిత్ర. యీ సంతోషసమయంలో ఆగాథ చెప్పి నీ మనస్సు వికలపరచడం నాకిష్టంలేదు. కాని అనుకోనివిధంగా యీ ప్రశంస వచ్చింది. కనుక, నాగాథ చెప్పడానికే నిశ్చయించుకొన్నాను."

* * *

కమలా, యిది జరిగి నాలుగు సంవత్సరాలైంది. నేను కాలేజీలో చదువుతున్న



రోజులు. ప్రతిరోజూ విజయవాడ వెళ్ళి వస్తూండేవాణ్ణి. ఆనాడు బండిలో కూర్చుని స్నేహితులందరు కులాసాగా కబుర్లు చెప్పుకుంటున్నాము. మా సంభాషణలు రాలీ సైకిలు మరమ్మతుదగ్గరనుంచి రష్యా - అమెరికాల రాజకీయాలవరకు సాగిపోయాయి! ఇంకొక్క క్షణంలో బండి కదులుతుందనగా ఓ అపరిచితవ్యక్తి మా కేరేజిలో ఎక్కాడు. నా స్నేహితుడు శ్రీహరికి అతను పరిచయుడే కాబోలు ఆహ్వానించి తన ప్రక్క ఖాళీ చూపించాడు. 'సంతోషం' అంటూ ఆ నూతన వ్యక్తి కూర్చుని చేతిలో వారపత్రికతీసి చూస్తున్నాడు. నాకు కమ్యూనిజమంటే అప్పుడప్పుడే అభిమానం ఏర్పడుతోంది. పూర్తిగా తెలియకపోయినా ఏ విషయాన్నిగురించి అయినా దిట్టంగా వాదించడం మాత్రం నాకు అలవాటైంది. అలానే ఆనాడు ప్రక్కన కూర్చున్న మిత్రునితో కమ్యూనిజం గురించి మాట్లాడుతున్నా. తెలిసీ తెలియని వారి వంకరటింకరప్రశ్నలతో నాకు ఆవేశం హెచ్చింది. నామాటలు వాదనలోనుంచి ఉపన్యాసధోరణిలో పడ్డాయి. అంతటితో ప్రత్యర్థులంతా గమ్మున వూరుకున్నారు. అప్పుడప్పుడు నాచూపు ఆ నూతన వ్యక్తిమీదికి పోతోంది. కాని నేను ఎప్పుడు అతనివంక చూచినా అతను నాకేసి చూస్తూనేవున్నాడు. దాన్నిబట్టి నేను అతను నామాటల్ని శ్రద్ధగా వింటున్నాడని వూహించుకున్నాను. మాటల సందట్లో విజయవాడస్టేషను సమీపించింది. విద్యార్థులందరం దిగి కాలేజీకి దారితీశాము. ఒక్కసారి గుర్తువచ్చి ఆ కొత్త వ్యక్తి వంక చూశాను. అతను నామిత్రుడు శ్రీహరితో మాట్లాడుతున్నాడు. బహుశః నాగురించి వివరాలు అడుగుతున్నాడని అనుకొన్నాను.

యీ సంఘటన జరిగిన పదిరోజులకు నేను కాలేజీనుంచి యింటికివచ్చి షికారుగా అలా పార్కుకు బయలుదేరి వెళుతున్నాను. వెనుక నుండి "మధుసూదనరావుగారూ" అనే పిలుపు నన్ను ఆపింది. అతను నన్ను సమీపించడంతో మీరేనా నన్ను పిలిచింది? అని అడిగా. ఔనని క్లుప్తంగా జవాబిచ్చాడు. కాని నేను అత నెవరా అని ఆలోచిస్తున్నాను. ఎక్కడా చూచినట్లు లేదు. నా వుద్దేశాన్ని గ్రహించే కాబోలు! "మీకు గుర్తు లేనట్లుంది. పదిరోజుల క్రితం నేను మీ కేరేజీలో విజయవాడ ప్రయాణం చేశాను. శ్రీహరి ప్రక్కనే కూర్చోలేదూ? మీరు రాజకీయాలు మాట్లాడుతున్నారు" అని అంటూండగానే "ఓహో, మీరా! క్షమించండి. జ్ఞప్తిలేకపోయింది" అన్నా. ఆ తరువాత నన్ను కాఫీకి ఆహ్వానించాడు. కొంచెం బలవంతంమీద అంగీకరించాను. శలవుతీసుకొని విడిపోయాము. ఆ రాత్రికి మాయింటికే వచ్చి ఏవేవో విషయాలనుగూర్చి ప్రస్తావించాడు. అతను నాతో మాట్లాడిన కొద్దికాలంలోనే చాలామంది అతన్ని పలుకరించిపోవడంచేత నే నెరుగకపోయినా యీ పేటకు పరిచయస్తుడే నని అనుకొన్నాను. అలా నాలు గైదు రోజులు వచ్చి ఓ అర గంటసేపు మాట్లాడి వెళుతున్నాడు. నాకు ఆశ్చర్యంవేసింది! ఏమిటీ ఇంత చనువు? మొదటినుంచి యితని ప్రవర్తన నాకు ఆశ్చర్యంగానే తోస్తోంది. రైలులో కనుపించితే కాఫీకి పిలిచాడు. తరువాత యింటికే వస్తున్నాడు. ఇంతవరకూ అతన్నిగురించి నేనేమీ తెలుసుకోలేదు. గోపాలరావు అని పేరు మాత్రం విన్నాను. యిలానే వారంరోజులు గడచిపోయాయి.

ఒకనాటి సాయంకాలం యింట్లోనే కూర్చొని క్లాసుపుస్తకాలు చూస్తున్నాను. యింతలో చిన్న కుర్రవాడొకడు "మధుసూదనరావుగా రెవరండీ" అంటూ ఓ కవరుతోసహా ప్రవేశించాడు. నేనే నని చెప్పగానే "గోపాలరావుగారిది మీకు యివ్వమన్నారని" ఆ కవరు నాచేతికిచ్చి వెళ్ళిపోయాడు. గోపాలరావుగారేమిటి? వుత్తరం వ్రాయడమేమిటని ఆశ్చర్యంతో కవరు చించి వుత్తరం చూశాను. దానితో నా అనుమానాలన్నీ తీరిపోయాయి. గోపాలరావు తనను గురించిన పూర్తివివరాలు వ్రాశాడు. అతనిది సమీపగ్రామమట. చాలారోజుల నుండి యిక్కడే ఒక రైస్‌మిల్లులో అకౌంటెంటుగా వుంటూ హోటలులో భోజనంచేస్తున్నాడట. కుటుంబమంతా స్వగ్రామంలోనే వున్నదట. స్నేహితులమూలాన నేనో రచయితననీ, రాజకీయాలంటే చాల అభిమానిస్తాననీ విని తన మనఃప్రవృత్తి కూడా యిదే కావడంచేత నా స్నేహాన్ని అభిలషిస్తున్నాననీ వ్రాస్తూ అభ్యంతరం లేకపోతే మీ స్నేహాన్ని గాఢంగా కోరుతున్నానని ముగించాడు.

ఆ తరువాత నేను అతని కోరిక అంగీకరించడం ఒకరిదగ్గరకు మరొకరు తరచుగా వెళ్ళడం సంభవించింది. క్రమక్రమంగా మా స్నేహం వృద్ధిపొందింది. ఒకరి నొకరు విడిచి వుండలేనంతగా మాస్నేహం రూపొందింది. కాని ఆ తరువాత తెలుసుకున్నాను. రాజకీయాలలో గోపాలరావు నా ప్రత్యర్థి! నేను తరచుగా పత్రికల్లో వ్యాసాలు వ్రాస్తూండేవాణ్ణి. మరు సంచికలో నా రచనను ఖండిస్తూ గోపాలరావుగారి రచన వుండేది! అలానే అతను వ్రాసినా నేను ఖండిస్తూ వ్రాసేవాణ్ణి! యీవిధంగా మా రాజకీయ సంభాషణంతా పత్రికలద్వారా జరిగేది. మిగతా అన్ని విషయాలు మేమిద్దరం మనసు విప్పి మాట్లాడుకొనేవాళ్ళం. కాని ఒక్కవిషయంలో మా యిద్దరికి ఉత్తర దక్షిణ ధ్రువాల సంబంధం! స్నేహితులతో భోజనంచేయడం, వారిళ్లకు వెళ్ళడం యిలాంటివంటే నాకు యిష్టముండేది గాదు. కాని గోపాలరావు తత్వం దీనికి పూర్తిగా వ్యతిరేకం. అతని బలవంతాన నాలుగైదుసార్లు హోటలులో అతనితో భోజనంచేశాను. అలానే నాకు సినిమాలు చూడటం పెద్ద సరదాగావుండేదిగాదు. కాని గోపాలరావు బలవంతంమీద చాలా సినిమాలు చూశాను. యిలాగా మా జీవితాలు గడచిపోతున్నయి.

* * *

ఒకనాడు పార్కులో యిద్దరం మాట్లాడుతున్నాం. జనసమ్మర్దానికి దూరంగావుండటంచేత మాచుట్టు నిశ్శబ్దం తాండవిస్తోంది. అకస్మాత్తుగా గోపాలరావు అన్నాడు. "మధూ నీవు నా మరణానికి కారకుడవైనావు" అత్యాశ్చర్యపడ్డాను! "గోపాలరావ్! ఏమిటీ మాట? ఆలోచించే అంటున్నావా?"

"ఆ! పూర్తిగా ఆలోచించే అంటున్నా. కాని యిందులో నీదోషమేమీ లేదు. అలా జరగవలసివుంది జరుగుతుంది" ఆశ్చర్యంగానే అడిగాను. "నీ మరణానికి నే నెలా కారణమైనాను?"

"క్షమించు. నా జీవితంలో నేను నీకు చెప్పని రహస్యమంటూవుంటే అది యిదే!"

"అయితే ఆ విషయం నేను తెలుసుకుంటే నీమరణాన్ని తప్పించడానికి వీలుంటుందేమో!"

ఆలోచించకుండానే సమాధానమిచ్చాడు.

"లేదు అవకాశం ఎంతమాత్రం లేదు. పైగా నేను ఆ పంథాను గర్హిస్తాను."

ఆ తరువాత ఎంతో ఒత్తిడిచేశాను. యీవిషయాన్ని గురించి చెప్పమని. కాని గోపాలరావు ససేమిరా చెప్పనన్నాడు. అడ్డదిడ్డమైన ప్రశ్నలతో కొంతవరకైనా రహస్యాన్ని లాగుదామని ప్రయత్నించా. కాని నా ప్రయత్నం ఫలించలేదు. చివరకు కోపముతో అన్నాను.

"గోపాలరావ్ మరి యీసంగతిమాత్రం ఎందుకు చెప్పావ్? యిప్పుడు నా మనస్సు ఎంత బాధపడుతోంది!" చిరునవ్వుతో "మధూ, యింతవరకూ నీకు చెప్పకుండా వుండలేకపోయాను కాని మధూ, ఎన్నేండ్లో బ్రతకవలసిన నేను సంవత్సరంలో మరణించబోతుంటే నాకు దుఃఖంకదూ? అందుచేత నా దుఃఖంలో నీకు కొంత పంచియిద్దామని చెప్పాను" అని వ్యంగ్యంగా జవాబిచ్చాడు!

యీ సమాధానం నాకు మరింత ఆశ్చర్యాన్ని, మనస్తాపాన్ని కలిగించింది. "యిది కూడా సంవత్సరంలోనే జరుగుతుందా?"

"అవును"

"నిజమా?"

"నిజం ముమ్మాటికీ నిజం. నేనేనాడేనా అబద్ధమాడేనా మధూ?"

'లేదు' గద్గద స్వరంతో సమాధానమిచ్చాను. నిజంగా అతని జీవితంలో అబద్ధం చెప్పలేదు.

కమలా, ఎన్నివిధాల ప్రయత్నించినా ఆ రహస్యాన్ని తెలుసుకోలేకపోయాను.

ఒకనాడుగోపాలరావు మాయింటికి వచ్చి "మధూ, ఈవాళ తప్పకుండా సినిమాకు వెళ్ళాలి త్వరగా రా" అని అన్నాడు.

"అబ్బ! పోనిండి. మీకెప్పుడూసినిమాలే! నాకాలేజీచదువు నేంచేయాలి? నేను రాను"

"మధూ యీరోజు నాజీవితంలో ఒక ముఖ్యదినం 'లైలామజానూ' హిందీ సినిమా. ఆఖరుసారిగా మనం దీన్ని చూడాలి."

"ఆఖరుసా రేమిటి ?"

"అవును మధూ, నా జీవితంలో మరి సినిమాలు చూడదలచుకోలేదు. తప్పకుండా వెళ్ళాలి."

తప్పనిసరై సినిమాకు వెళ్ళాం. కాని ఏ సినిమా చూస్తున్నా విమర్శతో ఆ కాసేపు కాలం గడిపే గోపాలరావు నాడు మాట్లాడనేలేదు! మధ్య మధ్య గోపాలరావు ముఖవైఖరిని జాగ్రత్తగా పరిశీలించాను. విషాదరేఖలు అంత చీకట్లోనూ స్పష్టంగా నాకు కనుపించాయి. దారిలో కూడ గోపాలరావు ఏమీ మాట్లాడలేదు. నన్ను యింటివద్ద దిగవిడుస్తూ "మధూ, మజ్నాచర్య స్వభావసిద్ధమే కదూ?" అన్నాడు. నేను సమాధానమిచ్చే లోపుగనే వస్తానని చెప్పి వెళ్లిపోయాడు. ఈ చర్యలేమీ నాకు అర్థం కాలేదు! నా స్నేహితులు నన్నంటువుంటారు. "మధు సూక్ష్మగ్రాహి. ఆవులిస్తే ప్రేవులు లెక్కిస్తాడు" అని! కాని స్నేహితులమాటలు గోపాలరావుపట్ల వమ్మయిపోయాయి. అతని మరణానికి నేను కారకుడ నవుతాననీ, అది సంవత్సరంలోనే జరుగనున్నదనీ - యింతకుమించి ఏమీ తెలుసుకోలేకపోయాను. చివరకు నేనూ నిర్ణయానికి వచ్చాను. మేమిరువురం రెండు రాజకీయ కక్షలకు చెందినవాళ్లం. అప్పట్లో ఆరెండు కక్షలూ చాల విరోధభావంతో ప్రవర్తిస్తున్నాయి. అందుచేత నా రక్షణప్రయత్నంలో అతను తన జీవితాన్ని కోల్పోతాడేమో నని.

* * *

గోపాలరావుతో నా పరిచయం యేర్పడి తొమ్మిది నెలలు దాటిపోయాయి. ఇన్నాళ్ల నుండి మేము కలుసుకోనిరోజంటూ లేదు. మాచెల్లెలు శారద పెండ్లి యిక వారంరోజులే వుంది. ఈ కారణంతో నాకు బయటికి వెళ్ళడానికే తీరికలేదు. యింటివద్ద పందిళ్లు పాకలు వేయించడం, పనివాళ్ళకు పనులు పురమాయించడంతోనే సరిపోతోంది. మా నాన్న బజారుపనులూ, గ్రామాంతరకార్యాలూ చూస్తున్నాడు. మరి గోపాలరావూ రావటంలేదు. ప్రక్కయింట్లో వెంకటరత్నం కూడా గోపాలరావు హోటలులోనే భోజనము. అందుచేత అతన్ని పిలిచి అడిగాను. "గోపాలరావుగారు వారం రోజులనుండి సుస్తీగా వుంటున్నారట. వారి మామయ్యగారింట్లో వున్నారు. హోటలుకు రావడం లేదని" జవాబిచ్చాడు. నేను చాల నిరుత్సాహపడ్డాను. శారద పెండ్లి యింకా నాలుగురోజులు వుందనగానే గోపాలరావును మాయింటివద్ద నేవుండి నాకు సహాయకారిగా వుండమని కోరుదామని అనుకున్నా. వెంకటరత్నం "గోపాలరావు వారం రోజులనుండి లేవడంలేదు" అన్న మాటలు నాచెవుల్లో ప్రతిధ్వనించి ఎంతో బాధ కలుగచేశాయి. యిక వుండలేకపోయా. ఎన్ని పనులున్నా గోపాలరావును చూచితీరాలి అనుకున్నా. మానాన్న శుభలేఖలు తీసికొనివచ్చి "ఒరే మధూ ఆ లిస్టుప్రకారం వీటన్నిటికి అడ్రసులు వ్రాయరా" అని నాముందు వేశాడు. నాకు మనసు బాగా లేదు. అందుచేత ఎలాగైనా తప్పించుకోవాలని "నా అక్షరాలు బాగుండవు నాన్నా" అన్నా. "అయితే మరెలా? ఎవరిచేత వ్రాయించమంటావు. మన గోపాలరావు చక్కగా వ్రాస్తాడుకదూ? వెళ్ళిపిలుచుకొనిరా" అంటూ 'ఒరే గోపాల్రావు వారంరోజులనుండి రావడం లేదేమిరా?' అన్నాడు. "నాకిప్పుడే తెలిసింది నాన్నా సుస్తీగా వుందట" అన్నా. "పాపం వెళ్ళి చూసిరా, మరచిపోయేవు వెళ్ళి యీశుభలేఖ గోపాలరావుకు యిచ్చి తప్పకుండా రమ్మనమని చెప్పు" అని అన్నాడు. యీ అవకాశం దొరికినందుకు సంతోషిస్తూ ఆ శుభలేఖపై "ప్రియమైన గోపాలరావుగారికి" అని వ్రాసి జేబులో పెట్టుకొని బయలుదేరా.

గోపాలరావు మంచంమీద పడుకొని వున్నాడు. చూడగానే ఆశ్చర్యంవేసింది. మనిషి సగమైపోయాడు! నన్ను చూచి కూర్చోమని సైగచేశాడు.

గోపాల్, ఏమిటి జ్వరమా? కాదన్నట్లు తలవూపాడు.

"అన్నం తినడంలేదూ?"

"ఆకలి కావడంలేదు"

"డాక్టరుకు చూపించారా?"

"డాక్టరెందుకు?"

"మరి నీకు ఆరోగ్యమెలా కలుగుతుంది?"

"ఆరోగ్యమెందుకు" అని నవ్వాడు.

"అదిగో నీకెప్పుడూ హాస్యాలే, ఆరోగ్యమెందుకంటావేమిటి? సుఖపడటానికి"

"మధూ, నేను కోరే సుఖాన్ని డాక్టరు యివ్వలేడు. ఇచ్చే డాక్టరు నాకందుబాటులో లేడు"

"సరేగాని శారద వివాహం తెలుసా?"

"విన్నాను"

"ఎవరు చెప్పారు"

"గాలి"

"ఆదెక్కడిది?"

"మీ యింటిమీదనుంచి మా హోటలుకు వస్తో విన్నదట!

"నీమాటలకేం గాని యిదిగో ఆహ్వాన పత్రం! శ్రీ శ్రీ శ్రీ శ్రీ ప్రియమైన గోపాలరావుగారికి మధుసూదనరావు హృదయ పూర్వకంగా సమర్పించుకొన్నది" అంటూ చేతికిచ్చాను. శుభలేఖ అందుకోగా గోపాలరావు కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి!

"ఆదేమిటి గోపాల్? అలా కళ్ళంట నీళ్లు తెచ్చుకుంటావు?"

"ఏమీ లేదు. శారద పెళ్ళి నేను చూడవలసి కాదు చూడలేకపోతున్నానే అని."

"ఏం? ఎందుకు చూడలేవు?"

"ఎలా రమ్మంటావు? నాశరీరస్థితి___"

"ఆ అప్పటికి ఆరోగ్యం కలుగుతుందిలే. నీవు తప్పకుండా రావాలి! నిన్ను నాలుగు రోజులుముందే పిలిచి యింట్లోవుండి నాకు సహాయంచేయమని అడుగుదామనుకున్నాను."

"మధూ యింటివద్ద ఎన్నో పనులుంటాయి వెళ్ళు పనులు పూర్తిచేయి" అన్నాడు. నాకు ఆశ్చర్యంవేసింది. యింతవరకు గోపాలరావు నన్నేనాడూ 'వెళ్ళు' అని అనలేదు. ఎంతసేపు వున్నా యింకా వుండమనే వేధించేవాడు. నేటికి అందులో యింతటి అనారోగ్యస్థితిలో "వెళ్ళు" అని అనడం నాకు బోధపడిందికాదు.

"వస్తాను మళ్లీ పెళ్ళిహడావుడిలో నాకు రావడానికి వీలుంటుందో వుండదో తప్పక నీవే రావాలి సుమా" అని హెచ్చరించాను. గోపాలరావు అదోవిధంగా నవ్వాడు.

కమలా, చెప్పమరిచాను. శారద వివాహం మాయింటివద్ద కాలేదు తిరుపతిలో. యీసంగతి కూడా గోపాలరావుతో చెప్పాను. దానికి గోపాలరావు "సంతోషం శారద వివాహం పవిత్రమైన తిరుపతిక్షేత్రములో జరగడం మరింత శుభప్రదం. శారద నూరేండ్లు సుఖంగా కాలం గడుపుతుంది" అంటూ నన్నొక్కసారి కౌగిలించుకున్నాడు.

వివాహం నిర్విఘ్నంగా జరిగిపోయింది.

*  *  *

ఇంటికి తిరిగివచ్చాము. వచ్చీ రావటంతోనే గోపాలరావు యింటికి బయలుదేరా ఆరోగ్యంగూర్చి ఆందోళనతో. గోపాలరావు లేనిలోటు పెళ్ళిలో నాకు స్పష్టంగా కనుపించింది. ఇంక కొద్దిదూర ముందనగానే యింటిముందు పెద్దగుంపు కనుపించింది. ఏమిటా అనుకున్నాను. క్రమంగా రోదనధ్వనులు కూడ వినిపించాయి. నాగుండె గుభేలుమంది. గుంపును తొలగించుకొని లోపల ప్రవేశించాను. గోపాలరావు ఆత్మీయులంతా పెద్దగా దుఃఖిస్తున్నారు. వెళ్ళి గోపాల్ మామ గారిముందు నిలబడ్డా. అతను గద్గదస్వరంతో "మధూ-గోపాలరావు మనల్ని విడిచిపెట్టి అప్పుడే మూడురోజులైంది." అని కళ్ళవెంట నీళ్ళు బొటబొట కార్చాడు. నా కపుడు పూర్తిగా మతిపోయింది. గోపాల్ అంటూ అలానే కూలబడ్డాను. ఆస్థితిలో నేను ఎంతసేపు వున్నానో కాని నాకు తెలివిగలిగిచూచేటప్పటికి మా యింటిలో మంచంపై పరున్నాను. మా తల్లిదండ్రులు నావంక దీనంగా చూస్తున్నారు. వెంటనే మళ్ళీ నా కళ్ళు మూసుకుపోయాయి. అకొద్దిస్మృతిలో నేను వింటున్నా. "ఆత్మహత్య చేసుకున్నాడు. చిటికెడుపాడి గోపాలరావును యీ లోకం నుంచి తీసుకుపోయింది. డాక్టరు ఎంతప్రయత్నిస్తే ఏం లాభం? మధు అంటే ఎంత ప్రేమ. అతని నోటంట చివరిసారిగా వెలువడ్డమాటలే అవి. మధుకు నా ప్రేమపూర్వక నమస్కారాలని చెప్పండి. శారద నూరేండ్లు సుఖంగా జీవించాలి. మధూమధూ అంటూనే కన్నులు మూశాడు." ఆ తరువాత వాళ్ళు ఏమనుకుంటున్నారో మరి నాకు వినిపించలా!

ఆమరునాడు నేను పూర్తిగా తెలివిలోనే వున్నా. గోపాలరావు మాటలు నాకు వినిపిస్తున్నాయి. "మధూ, నీవు నా మరణానికి కారకుడవైనావు." నేను యిదివరకు అనుకొన్న రాజకీయ కారణాలేవీ గోపాలరావు మరణానికి కారణం కాలేదే? మరి యిదేమిటి? ఆత్మహత్య ఎందుకు చేసుకున్నాడు? లోకమే దీనికిసమాధానం చెప్పలేకపోయింది. మరి నేను లోకంలో ఒక వ్యక్తినేగా?

నా ఆలోచనలన్నీ ఒక్కసారి విరమించబడ్డాయి. ఆనాడు గోపాలరావు వుత్తరం తెచ్చిన కుర్రవాడే తిరిగి నేడొక వుత్తరంతో ప్రత్యక్షం! నన్ను సమీపించి, "మధుసూదనరావుగారూ, చచ్చిపోయిన గోపాలరావుగారు యీ వుత్తరం మీ కిమ్మని అయిదు రోజులక్రింద యిచ్చారు" అన్నాడు. అబ్బాయ్! మరి యిన్నాళ్ళకు తెచ్చియిచ్చావే వుత్తరం? అన్నా. "ఏమోనండీ, నాకీ వుత్తరంయిస్తూ ఐదురోజులకు అంటే ఆదివారం నాడు మీ బడి వుండదే ఆరోజు యివ్వాలి. ఈలోగా యివ్వవద్దుసుమీ. ఇంకెవరికీకూడా యివ్వవద్దు అని మరిమరి చెప్పారు. అందుచేత అలానే చేశాను" అని చెప్పిపోయాడు. ఉత్తరంలో ఏముంటుందోనని అతి ఆతృతగా కవరు చించాను. ముందు దసరా పండుగనాడు ఒకరి భుజాలపై మరొకరు చేతులువేసి తీయించుకొన్న ఫోటో! ఆ తరువాత వుత్తరం, కళ్ళవెంట నీళ్లు కారుస్తూనే వుత్తరం చదవడం పూర్తిచేశాను, అంతే. అప్రయత్నంగా నా రెండుచేతులూ నా ముఖాన్ని మూసివేశాయి. కమల కంటినుంచి వేడివేడిగా నీటిబొట్లు నా చేతులమీద పడ్డాయి!

ఐదునిమిషాలు గడిచాయి. మరి ఆ వుత్తరంలో విషయాలు చెప్పరూ? గద్గదస్వరం

తో కమల ప్రశ్నించింది. "లేదు కమలా నేనా సంగతులు చెప్పడంకంటె నీవే చదవడం మంచిది. అది నా ట్రంకులో 'నిరాశ' అనే పుస్తకంలో వుంది" అన్నా. ఉత్తరంలో ఇలావుంది:

* * *

"ప్రియమైన మధూ, నీవు ఇప్పుడు తిరుపతి కొండలమీద శారద వివాహం జరుపుతుంటావు. కాని ఆ క్షణాలలో నా జీవిత సమాప్తికి కృషిచేస్తున్నానని నీకు తెలియదు. తెలిస్తే చేస్తావా? మధూ నీకు తెలియకుండా నీవు నా మరణదేవతను సమీపంచేస్తున్నావు. ఎన్నాళ్ళక్రితం చెప్పాను? ఇలా జరుగుతుందని. కాని మధూ నీవు నిర్దోషివి. మరి యిదెలా జరుగుతున్నది? ఆ సంగతే నీకు వివరించడానికి ప్రయత్నిస్తున్నా.

విజయవాడ ట్రెయినులో నిన్నుచూచిన తరువాత నీ స్నేహాన్ని అభిలషించాను. నీవు సమ్మతించావు. కాని అదే సమయంలో నీవు నా మరణానికి కారణభూతుడవైనావు! మధూ, మీ యింటికి తరచుగా వస్తూవుండేవాణ్ణి. ఆనాడు నాజీవితంలో సుదినం. నా జీవితసహకారిణిగా, నా అర్ధాంగిగా ఆ అందమైన యువతిని ఎన్నుకున్నాను. యీ నిర్ణయంలో నేను త్వరపడలేదు సుమీ! నన్నాకర్షించిన ఆవ్యక్తి ఎవరో గాదు. నీ సహోదరి శారద. ఇంతటి ముఖ్యవిషయాన్ని నీకు నా జీవితకాలంలో చెప్పనందుకు, నా వ్రాతమూలంగా తెలియజేసినందుకు క్షమించు మధూ. నేను కేవలం అందని పండ్లకు అర్రులు చాచాను. సామాన్య కుటుంబీకుడనైన నేను ధనవంతుని పుత్రికను కోరడం అవివేకం! కాని మధూ నీ వెరుగవూ? ప్రేమకు వివేకముతో పనిలేదు. ధనంతో అంతకంటె నిమిత్తములేదు. తప్పనిసరికూడాను. భగవంతుడు మానవుని సృష్టించినపుడే ప్రేమను సృష్టించాడు. మరి నేను మానవత్వానికి అతీతుణ్ణా?

క్రమక్రమంగా నా జీవితంలో మార్పు వచ్చింది. కన్ను తెరచినా, కన్నుమూసినా నాకు శారద కనుపించేది! రాత్రింబగళ్ళు శారదనే తలుస్తూ రోజులుగడిపేవాణ్ణి. నే నేనాడో గుర్తించాను. శారద నాభార్య కావడం అసంభవమని, కాని నా మరణాన్నికూడ నేనేనాడో తెలుసుకున్నాను. శారద లేని జీవితం నాకు దేనికి? ఆ జీవితం నీటిఛాయైనా లేని ఎడారి! నేనా ఎడారిలో జీవించడం కంటె ఆ ఎడారినుంచి నిష్క్రమించడం ఎంత హాయి?

శారద వివాహం నిశ్చయంకాగానే నాకు మతిపోయి మంచంపట్టాను. నేను మనసార ప్రేమించిన నాశారదను మరొకరు చేపట్టుతూ ఆ శుభలేఖను నీవు నాకందించినపుడు మధూ నాలో ప్రాణం వుందా? కాని విధి బలీయమయింది.

మధూ యిక నే చెప్పేదేముంది? నీచదువు పూర్తిచేసి ప్రేమించిన యువతిని పెండ్లాడు. మరచిపోయాను. ఆ కొత్తవ్యక్తి - నీభార్య- నా సోదరి! నాసోదరికి నా ప్రేమపూర్వక ఆశీస్సులందచేయి. యిక శారద సుఖమే నాసుఖం. శారద కష్టమే నాకష్టం. యీ పదాలకు నీ హృదయంలో సముచితస్థానాన్నిచ్చి గౌరవించు. శారద సౌఖ్యానికే నీశక్తి వినియోగించు.

ఒక్కమాట మధూ నాకు ఒక్క కోరిక వుంది. తప్పక తీరుస్తావుగదూ? ఇన్నాళ్ల నుండి యిద్దరం ఒక్కటిగా మెలిగాము. కాని నేటికి పరమేశ్వరుడు మనల్ని వేరు చేశాడు. నా జ్ఞాపకార్థం నీవేమి చేస్తావు? నీ - నా సోదరి సమ్మతిపై మీ మొదటి కుమారునికి నాపేరు పెట్టండి. యిదే నా తుది వాంఛ. అప్పుడు నాఆత్మకు శాంతిలభిస్తుంది.

మరో లోకానికి వెళ్ళుతున్న
నీ గోపాలరావు.

ఒక్కసారిగా నా కనురెప్పలు విడివడ్డాయి. ఎదుట ఆవ్యక్తి ఎవరు? గోపాల్ కాదు. కమల గోపాలరావు సోదరి! చేతితో కాగితాన్ని మడుస్తూ - కళ్ళంట నీరు కారుస్తోంది! మా యిరువురినోటా ఒక్కసారిగా వెలువడ్డాయి! "గోపాల్ నిజమైన ప్రేమజీవి" అని.




# బాలసుధ

నేటి బాలపాపలే రేపటి పౌరులు. బాలపాపలే దేశానికి సంపద.
వారి ఆరోగ్యమే దేశానికి ఐశ్వర్యం.

అట్టి బాలపాపల బలారోగ్యాన్ని పెంపొందించే మిఠాయివంటి తియ్యని మందు. ఇదిమలయాళ మూలికలచే తయారుచేయబడినది. దుర్బలులైనవారు మేహాకాకచే బక్కచిక్కినవారు గజ్జి తీట గజ్జి అజీర్తివాయువుతో పాడిదగ్గుతో మలబద్ధకంతో విరేచనాలతో నీటిచురుకుతో బాధపడు బాలబాలికలచే ఈమందు సేవింప చేయడంవల్ల ఆ వ్యాధులన్నీ నయమై వారు పుష్టితుష్టి పొంది బాగుగా యెదుగుదురు. ఎట్టి రుగ్మత లేనివారుకూడ దీనిని నిరభ్యంతరముగా వాడవచ్చును. దీని సేవతవలన వారికి రక్తపుష్టి హెచ్చి జ్ఞాపకశక్తి పెంపొందును. చదువుకొను బాలబాలికల మెదడుకు రసాయనంగా వుంటుంది.
3 ఏళ్ల బిడ్డనుండి వాడవచ్చును. టిన్ను 1-కి రు. 3-0-0

ధనలక్ష్మి అండు కో., :: సాకారుపేట పోస్టు, :: మదరాసు.